# సాలభంజిక

**వీరపల్లె వీణావాణి**




వాలు కుర్చీలో పడుకుని వార పత్రికని చదువుకుంటున్న వాసంతికి వారించ లేనంత కోపం రావడంతో తన చేతిలోని వార పత్రికని విసిరి దూరంగా కొట్టింది. వాస్తవానికి వాసంతికి అంత కోపం ముంచుకు రావడానికి కారణం ఆ వార పత్రిక కాదు. ఆ పత్రికలో జాహ్నవీదేవి అనే ఒక రచయిత్రి రాసిన ఓ కథ.

ఛీ..ఛీ..! ఏమిటో అర్థం పర్థం లేని కథలు! వీళ్ళు ఎందుకింత అవాస్తవికంగా రాస్తారు? తాము రాసిన కథ ఏ పత్రికలోనో ప్రచురితమైతే కొన్ని వేలమంది పాఠకులు చదువుతారనే ప్రాథమిక విషయాన్ని కూడా వీళ్ళెందుకు గుర్తించరు? వాస్తవాలని ఇంత దారుణంగా వక్రీకరించి రాస్తే వీళ్ళకి ఒరిగే ప్రయోజ నాలేమిటి?

వాసంతి బుర్రలో ఇలాంటి ప్రశ్నలెన్నో చెలరేగాయి. ఆ కథను రాసిన రచయిత్రి మీద వాసంతి విరుచుకు పడింది. అలాంటి వాస్తవ విరుద్ధమైన కథను రాసినందుకు ఆ రచయిత్రిని విడిచి పెట్టకుండా గట్టిగా నాలుగు వాతలు పెడితే బాగుండున నిపించింది వాసంతికి. వెంటనే ఓ కాగితమూ, పెన్నూ అందుకుంది వాసంతి.

ఆ పత్రిక వాళ్ళు తన ఉత్తరాన్ని ఆ ఉత్తరాల శీర్షికలో పరచురిస్తారో లేదో. పైగా తను రాయబోతున్నది ఘాటైన ఉత్తరం కనుక, బహుశా వాళ్ళు దీన్ని ప్రచురించడానికి కొంత ఇబ్బంది పడవచ్చు. పోనీ ... ఈ ఉత్తరాన్ని ఆ రచయిత్రికే రాసి, కవర్‌మీద కేరాఫ్ పత్రిక అడ్రస్ రాస్తే తప్పకుండా పత్రిక వాళ్ళు ఆమెకి రీ డైరెక్ట్ చేస్తారు.

ఆ ఆలోచన రావడంతోటే... గబ గబా ఉత్తరం రాయడం ప్రారంభించింది. వాసంతి.

''జాహ్నవీదేవి గారికి,

ఈ వారం 'ఆంధ్రమిత్ర' సచిత్ర వార పత్రికలోని 'మాయాజాలం' అనే మీ కథను స్త్రీ, పురుషుల మధ్య గల పవిత్రమైన ప్రేమని ఒక మాయాజాలంగా, వట్టి బూటకంగా పరిగణిస్తున్న మీ అపరిపక్వ భావనా సంస్కారానికి నా ప్రగాఢమైన సానుభూతిని ఈ విధంగా ప్రకటిస్తున్నందుకు ఆగ్రహించర నుకుంటాను.

''జీవితాన్ని పంచుకున్న ఇద్దరు వ్యక్తుల మధ్య విశ్వాసాన్ని పెంచే కథల్ని రాయలేకపోతే పోయారు. కానీ అపనమ్మకాల్నీ అసంతృప్తినీ పెంచే కథల్ని మాత్రం ఎప్పుడూ రాయకండి. మీ కథలో లావణ్య తన కన్నవాళ్ళను కూడా కాలదన్నుకుని, తను ప్రేమించిన గోపీతో వెళ్ళిపోయి గుళ్ళో పెళ్ళి చేసుకుంటుంది. తన మీద తన భర్తకున్న అమూల్యమైన ప్రేమకి మురిసిపోతుంది లావణ్య. ఆమెకి కూడా భర్తంటే పంచ ప్రాణాలు.

''కానీ.. కథ ముగింపుకొచ్చే సరికి లావణ్య ప్రేమ కలుషితమయినదే తప్ప స్వచ్ఛమైంది కాదని తెలుసుకున్న గోపీ నిర్ఘాంతపోతాడు. కథకి ట్విస్టింగ్ ఇద్దామనే ఆరాటం కొద్దీ.. మీరు వాస్తవాన్ని విస్మరించారు. ప్రేమకి అర్థం తెలిసిన మనుషులెవవరూ మీ కథలోని లావణ్య[illegible]కే సారి ఇద్దరు వ్యక్తులకు తన హృదయంలో ఒకే స్థానాన్ని ఇవ్వరు. అవసరాన్ని బట్టి మార్చుకోవడానికి


ప్రేమనేది మాసిపోయిన వస్త్రం కాదు.

"ఇది వ్యాపార యుగమని, జీవితంలోని సమస్త విలువలూ వ్యాపారపు రంగునే పులుముకుని ఉన్నాయని, ఆధునిక వ్యాపార జీవన సంస్కృతిలో మహత్తరమైన ప్రేమలూ, గీమలూ ఉండవని, అవన్నీ కేవలం మారీచ మాయలేనని ఈ కథలో మీ రొక స్టేట్‌మెంట్ కూడా ఇచ్చారు. జాహ్నవీ దేవి గారూ! మీ కళ్ళకూ, కలానికీ అగుపించని, స్వార్థం తోటి సంబంధం లేని ప్రేమ ఎలా ఉంటుందో చూద్దురు గానీ మీ రోసారి మా ఇంటికి...

"టక్ టక్ టక్"

వాసంతి ఆ చప్పుడు విని ఉత్తరం రాయడం ఆపి, తలతిప్పి తలుపు వేపు చూసింది. తలుపు మీద ఎవరో టక టక మంటూ చప్పుడు చేస్తున్నారు. వాసంతికి కోపం వచ్చింది. ఆవిడకంత కోపం రావడానికి కారణం, తను చదివిన కథ కాదు. ఆ కథని రాసిన రచయిత్రి అంతకంటే కాదు. అయిదు రోజుల క్రితం ఆఫీస్ పని మీద వైజాగ్ వెళ్ళి, ఇంకా ఇంటికి తిరిగిరాని ఆవిడ భర్త చలపతి.

వాసంతి పైకి లేచి, సగం రాసిన ఉత్తరాన్ని టేబుల్ సొరుగులో పడేసి, గబ గబా వెళ్ళి తలుపు తీసింది.




తన అంచనాను తల కిందులు చేస్తూ ఎదురుగా ఓ వృద్ధుడు. ఆయనకి సుమారు అరవై ఏళ్ళుంటాయి. ఆయన ముఖం తోట కాడలా వాడిపోయి ఉంది. ఆయన ఒంటి మీద బట్టలు చెమటతో బాగా తడిసిపోయి ఉన్నాయి. ఆయన కుడి చేతిలో ఓ సంచి ఉంది. ఇదివరకు ఎప్పుడూ, ఎక్కడా ఆయన్ను చూసి ఎరగదు వాసంతి.

"అమ్మా! చలపతిరావు ఇల్లి....."

"ఇదేనండి" వాసంతి అలా చెప్పగానే తన నెత్తి మీది బరువేదో దిగిపోయినట్టు నిట్టూర్చాడాయన.

"ఆయన ఇంట్లో లేరండి" చెప్పింది వాసంతి.

"ఎక్కడి కెళ్ళాడమ్మా?"

"ఆఫీస్ పని మీద విశాఖపట్నం వెళ్ళారండి."

"ఎప్పు డొస్తాడు?".

"రాత్రే వచ్చి ఉండాలి. బహుశా ఈ సాయంత్రానికో, రాత్రికో రావచ్చు. మీరు రేపు ఉదయం వస్తే... ఆయన ఇంట్లోనే ఉంటారు" అంటూ తలుపు మూసెయ్య బోయింది వాసంతి.

"అమ్మా!"

ఏమిటి? అన్నట్టు చూసింది వాసంతి.

"నువ్వెవరమ్మా? చలపతి భార్యవా?"

తలాడించింది వాసంతి.

"మాది.. జమ్మలపాళెం. నేను చలపతి బాబాయినమ్మా" మెల్లగా నవ్వుతూ చెప్పా డాయన.

"అలాగా? లోపలికి రండి" అంటూ మూయబోయిన తలుపును బార్లా తెరిచి, ఆయన చేతిలోని సంచిని అందుకుంది వాసంతి.

ఇద్దరూ లోపలికి రావడం తోటే తలుపు మూసి బోల్ట్ పెట్టింది వాసంతి. కూర్చోమంటూ ఆయన కో కుర్చీ చూపింది.

"మంచి నీళ్ళు తీసుకోండి" మర్యాద పూర్వకంగా ఆయనకి మంచినీళ్ళ గ్లాస్ అందించింది.

"మీరు నన్ను క్షమించాలి" అంది వాసంతి.

"దేని కమ్మా?"

"మీ రెవరో తెలియక ఇందాకా నేను తలుపు మూసెయ్యబోయాను" నొచ్చుకుంది వాసంతి.

"దాందేవుంది లేమ్మా! అయినా మే మంత ఎవరో నీకు తెలియడానికి ను వ్వెప్పుడూ మా ఊరు రాలేదు కదా!"

"నేను రాలేదు అనడం కంటే నన్ను రానివ్వ లేదంటే బావుంటుంది" తల దించుకుని అంది వాసంతి.

"నిన్ను... రా నివ్వక పోవడమా? ఎవరూ?"

"మా మావయ్య గారు"

"అని చలపతి నీతో చెప్పాడా?"

తలాడించింది వాసంతి

"మా మావయ్య గారికి ఆరోగ్యం బాగలేదని తెలిసింది. మా ఆయనకి మీ పల్లె టూళ్ళో దస్తగిరి అని ఓ స్నేహితు డున్నాడులెండి. అప్పుడప్పుడూ అతను ఊరి సంగతులు ఉత్తరాల్లో రాస్తుంటాడు. ఇంతకీ మా మావయ్య గారి ఆరోగ్యం ఎలా ఉంది?" అడిగింది వాసంతి.

"ఫర్వాలేదు. ఇప్పుడు కొంత కుదుట పడింది."

"ఆయన మొండి పట్టుదల కాకపోతే ఆయన ఇక్కడి కొచ్చేస్తే నేను దగ్గరుండి ఆయన ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటాను కదా" అంది వాసంతి.

"ఈ మాట ను వ్వంటే సరిపోదమ్మా! చలపతి కూడా అనాలి. అయినా మా అన్నయ్య విషయం నాకు చిన్నప్పటి నుంచీ తెల్సిందే కదా. ఆయనకి స్వాభిమానం ఎక్కువ" అన్నా డాయన.

"అన్నట్టు అడగడం మరిచాను. మీరు భోం చేశారా?"

"తినే వచ్చాను."

"ఎక్కడ తిన్నారు?"

"నా స్నేహితుడి ఇంట్లో"

"ఈ ఊళ్ళో మేం ఉండగా మీరు మరొకరి ఇంట్లో భోం చెయ్యడ మేమిటి? ఇంతకీ మీరు హైదరాబాద్ ఎప్పు డొచ్చారు?"

"నే నొచ్చి రెండు రోజులైందమ్మా! నా స్నేహితుడి ఇంట్లో దిగాను. నా పెన్షన్ సంగతి తెలుసుకు పోదామని వచ్చాను. ఇవాళ నువ్వు ఆఫీస్‌కి వెళ్ళలే దామ్మా?" అడిగా డాయన.

"మెటర్నిటీ లీవ్ పెట్టానండి. నేను నెలలు నిండిన మనిషినని కూడా మావయ్యకి తెలుసు. గర్భిణీ స్త్రీలకి ఏవేవో పిండి వంటలు తినాలనే కోరిక లుంటాయని ఆ పెద్ద మనిషికీ తెలుసు. వాస్తవానికి ఆయన నా కోరిక లేం తీర్చనవసరం లేదు. కానీ..."

"చెప్పమ్మా"

"నేనూ మామూలు ఆడదాన్నే కనుక.. ఈ స్థితిలో మెట్టినింటి వాళ్ళు వచ్చి నన్ను చూడాలని, నాతో ఆప్యాయంగా నాలుగు మాటలు. మాట్లాడాలని నే నాశించడం అన్యాయమౌతుందా? కడుపుతో ఉన్న కోడలిని కళ్ళ చూడడాని క్కూడా ఇష్టపడని ఆయనా ఓ మనిషేనా?"

"అమ్మా!"

"నేను సరే పరాయి దాన్ని. నా మీద ఆయనకి మమకారం లేక పోవచ్చు. కానీ, కన్న కొడుకు పట్ల కూడా ఆయన ఇంత కటవుగా వ్యవహరిస్తూ, కడుపు తీపికి కర్మకాండలు పెడుతున్నాడంటే ఆయ న్నేమనుకోవాలి? వన్యమృగాల్లో కూడా ఇంత వాత్సల్యరాహిత్యం ఉండదండీ" చాలా ఆవేశంగా అంది వాసంతి.

"నువ్వు పొరబడుతున్నావమ్మా!"

"లేదు లెండి. నేను యథార్థమే మాట్లాడుతున్నాను. ఆయన మీ అన్నయ్య కనుక ఆయన పట్ల మీకు అభిమాన ముంటే ఉండొచ్చు. అందువల్ల నా మాటలు మీకు చేదుగానూ అన్పించొచ్చు. అద్దం మన దైనంత మాత్రాన అది మన రూపాన్ని అందరికీ అందంగా చూపించాలనుకోవడం అర్థం లేని ఆలోచనే అవుతుంది" అంది వాసంతి.

"అద్దం మనక బారిన దైనప్పుడు, మన రూపం ఎంత బావున్నా అందులో వికృతంగానే అగుపిస్తుందమ్మా! ఎదుటి మనిషి ప్రవర్తనలో మన కర్థం గాని అంశాలు అనేక ముంటాయి. వాటిని అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యకుండా, మనకు అనుకూలమైన వక్రభాష్యాలిచ్చుకోవడం న్యాయమేనా తల్లీ!" అన్నా డాయన.

"మా మావయ్యని మీరు అనవసరంగా ఆకాశానికి ఎత్తుతున్నారు" వాసంతి అంది.

"లే దమ్మా! అగ్ని హోత్రునికి మాలిన్యాన్ని అంటగడుతుంటే ఆందోళన పడుతున్నాను."

"ఆయ నంత పవిత్రుడైతే మా పట్ల ఆయన గారికి అంత ద్వేష మెందుకు? కొడుకు మీద అంత అసహ్య మెందుకు?"

"ను వ్వంటే ఆయనకి ద్వేషమని నీ కెవరు చెప్పారు?"

"ఒకరు చెప్పేదేమిటి? ముంజేతి కంకణానికి అద్దంతో అవసరమేముంది?" అంది వానంతి.

"నీ పట్ల మీ మావయ్యకి ఎలాంటి ద్వేషం లేదమ్మా. కానీ కొడుకంటే ఆయనకి కొంత అసహ్యం ఏర్పడిన మాట మాత్రం నిజమే."

"ఎందు కేర్పడదూ! అసహ్యం? తను చూసిన ఆ సంబంధాన్ని కాదని ఆయన గారి కొడుకు నన్ను చేసుకున్నాడు కదా. పైగా మాది కులాంతర వివాహమాయె."

"చలపతి నిన్ను కులాంతర వివాహం చేసుకున్నందుకే తన తండ్రి తనను అసహ్యించుకుని.. దూరంగా ఉంటున్నాడని నీతో చెప్పాడా?" ప్రశ్నించా డాయన.

"తండ్రిలోని అవలక్షణాల గురించి ఆయన ఏమీ దాచకుండా నా కన్నీ చెప్పారు లెండి. ఛీ ఛీ! చాదస్తపు మనుమలూ, చాదస్తపు బుద్ధులూనూ. చేతికి అందబోయిన లక్ష రూపాయల కట్నం జారిపోయిందని ఒకటే దిగులు. కళ్యాణంలోనూ ఆర్థికపు కంపును తప్ప... అనుబంధాల సౌరభాల్ని అఘ్రాణించలేని దగుల్బాజీలు."

"చూడమ్మా! మీ మావయ్యకి తన కొడుకు మీద అసహ్యం ఏర్పడడానికి... ఇప్పుడు నువ్వు చెప్పినవేవీ అసలైన కారణాలు కావు. తన తండ్రే కాదు. ఆఖరికి నువ్వు కూడా అసహ్యించుకుంటా వేమోనని భయపడి, నిజాలను నీకు చెప్పకుండా దాచాడు చలపతి."

"నాకు చెప్పకుండా ఆయన దాచడ మేమిటి? మా ఇద్దరి మధ్యా దాపరికాలు లేవు" గట్టిగా అంది వానంతి.


"అని అనుకోవడం ఒక గొప్ప ఆత్మవంచన. ఈ ఆత్మవంచన వల్ల మీ ఆడ వాళ్ళకి కలిగే తృప్తి అమూల్యం. ఈ తృప్తి ఉండబట్టే ఈనాడు చాలా సంసారాలు ఏ బెడదలూ లేకుండా సవ్యంగా సాగిపోతున్నాయి. అరమరికలూ, దాపరికాలూ లేకుండా నా దాంపత్యం సాగిపోతూ ఉందని ఆత్మవంచన చేసుకోకపోతే ఏ సంసారమూ నిలబడదు."

వింటూ వుంది వానంతి.

"దాంపత్యం నిలబడేది విశ్వాసాల పునాది మీదే. ఆ పునాది వెయ్యడానికి ఆడది బహుకాలం కష్టపడాలి. కానీ మగవాడికి అర నిముషం చాలు. అర్ధ రూపాయి మల్లెపూలతో ఆడదాని గుండెల్లో కొండంత నమ్మకానికి శంకుస్థాపన చెయ్యగల శక్తి ఉంది మగాడికి" అంటూ వానంతి ముఖంలోకి చూశా డాయన.

"అంటే మీ ఉద్దేశ్యం... మా ఆయన నా దగ్గర ఏవో దాచి.. నన్ను మోసం చేశాడనా?" అంది వానంతి.

"చలపతి నీ దగ్గర దాచిన నిజా లేమిటో నేను




చెబుతా ను. కానీ.. నేను చెప్పేముందు నీ కడుపులో ఉన్న బిడ్డ మీద నువ్వు ఒక ప్రమాణం చెయ్యాలి" అన్నా డాయన.

"ఏమని?"

"నేను చెప్పబోయే నిజాల్ని విన్న తర్వాత నువ్వు వాటికి రియాక్ట్ కానని, ఇప్పటి లాగే నీ భర్తతో ప్రేమాభిమానాలతో వ్యవహరిస్తాననీ చెయ్యగలవా తల్లీ ప్రమాణం?"

"అలాగే" ప్రమాణం చేసింది వానంతి.

"చూడమ్మా! చలపతికి ఉద్యోగ మొచ్చి ఆరు నెలలు అవుతోంది. చలపతితో నీ పెళ్ళి జరిగి పది నెలలు దాటింది. పెళ్ళికి ముందు మీరు పరస్పరం ఎన్నేళ్ళ నుంచి ప్రేమించుకున్నారు?"

"సుమారు నాలు గేళ్ళ నుంచి"

"చలపతికి నీ మీ దున్న ప్రేమ వల్ల అప్పట్లో నీకు బలీయమైన నమ్మక ముండేదా?"

"అప్పుడే కాదు. ఆ నమ్మకం నా కిప్పుడూ ఉంది. నమ్మకం ఉండబట్టేగా మా పెళ్ళి జరిగింది?"

"జరగొచ్చు. కానీ.. మీ పెళ్ళికి సరిగ్గా పదిహేను రోజుల ముందు చలపతికి, మరో అమ్మాయితో పెళ్ళి కుదిరింది."

"అది వాళ్ళ నాన్న బలవంతంగా కుదిర్చిన..."

"కాదు. అది చలపతి అంగీకారం మీద, పెళ్ళి చూపుల్లో ఆ అమ్మాయి చలపతికి బాగా నచ్చడం మూలాన, చలపతి ఇష్టాన్ని అనుసరించి కుదిర్చిన సంబంధం తల్లీ అది."

"ఏమిటి? ఆయన పెళ్ళి చూపులకు వెళ్ళారా? మరో అమ్మాయిని ఇష్టపడ్డారా? ఆయన అంగీకారం మీదే ఆ పెళ్ళి కుదిరిందా? అయితే మరి ఆ సంబంధాన్ని కా దని ఆయన ఏరి కోరి న న్నెందుకు చేసుకున్నట్టు?" అడిగింది వానంతి.

"చలపతి ఏరిందీ, కోరిందీ నిన్ను కా దమ్మా! నీకు వచ్చిన ఉద్యోగాన్నీ, నీకు రాబోయే ఆస్తినీ."

"అంటే?"

"చెప్తాను. చలపతికి ముహూర్తాలు పెట్టుకుని శుభలేఖలు అచ్చు వేసేశారు. మీ ప్రేమ విషయం మీ మావయ్యకి బొత్తిగా తెలియదు. చలపతి చెప్పలేదు. వాడు నిజంగా చెప్పి ఉంటే ఆయనే మీ పెళ్ళి దగ్గరుండి సంతోషంగా జరిపించి ఉండేవాడు."

వానంతి ఆశ్చర్యపోయింది.

"ముహూర్తాలు పెట్టుకున్న ఆ ఎనిమిదవ రోజు.. హైదరాబాద్ నుంచి నువ్వు రాసిన ఉత్తరం చలపతికి అందింది. మీ ఆస్తికి సంబంధించి.. మీకూ, మీ దాయాదులకూ మధ్య సుప్రీం కోర్టులో నడుస్తున్న కేసు విషయంలో తీర్పు మీకు అనుకూలంగా వచ్చిందనీ, రెండ్రోజుల క్రితం నీకు గవర్నమెంట్ ఉద్యోగం కూడా వచ్చిందనీ ఆ ఉత్తరంలో చలపతికి నువ్వు రెండు శుభవార్తల్ని రాశావు."

"అవును, రాశాను."

"ఆ ఉత్తరం చదివిన చలపతి ముహూర్తాలు పెట్టుకున్న తన పెళ్ళిని వెంటనే కాన్సిల్ చెయ్యమని తన తండ్రితో చెప్పాడు. అంతేగాని అప్పుడు కూడా వాడు అసలు విషయాన్ని బయట పెట్టలేదు. చివరికి వాడు చెప్పా పెట్టకుండా హైదరాబాద్ వచ్చేశాడు. ఇక్కడ మీ పెళ్ళి రిజిస్ట్రార్ ఆఫీస్‌లో జరిగిపోయింది."

వానంతి వింటోంది.

"చలపతి నిన్ను చేసుకున్నాడంటే కారణం.. కోర్టు ద్వారా నీకు సంక్రమించబోయే ఆస్తి, నీ ఉద్యోగం వల్ల వచ్చే జీతం డబ్బులు ఇవేనని ఇప్పటికైనా నువ్వు గ్రహించ గలవా? నీకు ఇవి రెండూ లేకపోతే ఏమై ఉండేది? చలపతికి లక్ష రూపాయల కట్నంతో, అదే అమ్మాయితో పెళ్ళి జరిగిపోయి ఉండేది."

వానంతి నివ్వెర పోయింది.

"ఒక వేళ నీ ఉద్యోగం కంటే పెద్ద ఉద్యోగం, మీ ఆస్తికంటే ఎక్కువ ఆస్తీ ఆ అమ్మాయికి ఉన్నా నువ్వు రాసిన ఉత్తరం చలపతి మీద ప్రభావాన్ని చూపి ఉండేది కాదు. శుభ్రంగా ఆ అమ్మాయినే చలపతి అదే ముహూర్తానికి చేసుకుని ఉండేవాడు. అప్పుడు బలీయమైన మీ ప్రేమ ఏమై ఉండేది? బంగాళా ఖాతంలో పూర్తిగా మునిగిపోయిుండేది."

పెదవి కదపలేదు వానంతి.

"అసలు వాడు నిన్ను మనసారా ప్రేమించినదే నిజమైతే, వాడి ప్రేమ ఒక మాయాజాలం కాకపోతే, వాడు మరో అమ్మాయి కోసం పెళ్ళి చూపులకు వెళ్ళగలిగి ఉండేవాడా? లక్ష రూపాయల కట్నం కోసం ఆ అమ్మాయిని ఇష్టపడగలిగి ఉండే వాడా? వాడికి ఒక

హృదయమంటూ ఉంటే, ఒకే సారి ఇద్ద రమ్మాయిలకి ఒకే స్థానాన్ని ఎలా ఇవ్వగలిగే వాడమ్మా?'' వాసంతిని నిలదీసి అడిగా డాయన.

వాసంతి కంఠం మూగబోయింది.

''ఇది వ్యాపార జీవన సంస్కృతి. ఈ సంస్కృతిలో ప్రేమలూ.. గీమలూ ఉండవమ్మా. అవన్నీ మారీచ వేషాలు. కళ్యాణంలోనూ ఆర్థికపు కంపును తప్ప అనుబంధాల సౌరభాల్ని అఘ్రాణించలేని దగుల్బాజీ లెవరమ్మా? మీ తరం మనుమలా? మా తరం మనుమలా? ఎవరిది ఆర్థిక దృష్టి? ఎవరిది అనుబంధాల దృష్టి? పెళ్ళాం జీతాన్నీ ఆస్తినీ అడ్డం పెట్టుకుని ఆ పెళ్ళాం మీద ప్రేమ ఒలకబొయ్యడం ఏ నాగరికతకి సంకేతం తల్లీ?''

వాసంతి తల దించుకుంది.

''ముహూర్తాలు పెట్టుకున్న పెళ్ళిని చలపతి అలా చెడగొట్టేసి రావడంతో మీ మావయ్య అప్రతిష్ఠపాలై ఊళ్ళో తలెత్తుకుని తిరగలేక, ఎంత కుమిలి పోయాడో నీకు తెలియదు. అయినా ఆయన పెద్దగా బాధపడలేదు. చలపతిని అసహ్యించు కోలేదు. ఆయన అసహ్యించుకుంది చలపతిలోని వర్తకపు దృష్టిని మాత్రమే.''

వాసంతి స్థాణువై పోయింది.

''అదిగోనమ్మా! నువ్వు ఆ టేబుల్ మీద పెట్టావే ఆ సంచీ తీసుకుని లోపల చూడు. మీ మావయ్య అమానుషత్వం అగుపిస్తుంది. తన కోడలు నిండు మనిషని తెలిసి, నే నిలా హైదరాబాద్ వస్తుంటే ఏవేవో పిండి వంటలు చేయించి నా చేత పంపించాడు. ను వ్వన్నట్టు మీ మావయ్య వాత్సల్యం లేని వాడే. వన్యమృగం కంటే క్రూరమైన వాడేనమ్మా! ఎంత క్రూరుడు కాకపోతే కొడుకు కోసం తను రెండో పెళ్ళి కూడా చేసుకోకుండా తన నిండు యౌవ్వనాన్ని నిప్పులపాలు చేసుకుంటాడు?'' అన్నా డాయన.

వాసంతి హృదయం గిలా గిలా కొట్టుకుంది. ఆమె అవమానంతో ఆయన ముందు తలెత్తలేక పోయింది.

''చూడమ్మా! నువ్వేమీ అనుకోనంటే ఓ మాట అడగనా?'' వాసంతి ముఖంలోకి చూశా డాయన.

''అడగండి'' మెల్లగా అంది వాసంతి.

''కడుపుతో ఉన్న నిన్ను చూడడానికి మీ మావయ్య ఇక్కడికి రా లేదంటూ ఇందాకా నువ్వు తెగ బాధపడి పోయావు. మరి తన ఇంట్లో వండి వార్చే ఆడదిక్కు కూడా లేక, జబ్బుతో మీ మావయ్య మంచం మీద పడి ఉన్నాడని తెలిసీ, పరామర్శించడానికి నువ్వు గానీ, నీ భర్తగానీ ఎందుకు వెళ్ళలేదని నే నడిగితే... దానికి నీ సమాధానం ఏమిటి?'' ప్రశ్నించాడాయన.

బదులు చెప్పలేదు వాసంతి.

'' ఆ స్థితిలో తన కొడుకూ, కోడలూ వచ్చి, మంచం దగ్గర కూర్చుని తనతో ఆప్యాయంగా నాలుగు మాటలు మాట్లాడాలని ఆ ముసలివాడు ఆశించడం ఏ ధర్మశాస్త్రం ప్రకారం అన్యాయ మన్పించుకుంటుంది? మనకు న్యాయా న్యాయాలూ, ధర్మా ధర్మాలూ గుర్తుకు రావలసింది మన మనసు గాయపడినప్పుడు కా దమ్మా! ఎదుటి మనసును గాయపరుస్తున్నప్పుడు.. అప్పుడు గుర్తు రావాలి.''

ఆయన మాట్లాడే ప్రతి మాటా తూటాలా వాసంతి గుండెల్లోకి దూసుకుపోతూ ఉంది.

తుపాకీ పేలిన చప్పుడుతో చెట్టు మీది పక్షులన్నీ తుర్రున ఎగిరిపోయినట్టు... తన మామగారికి సంబంధించి వాసంతి గుండెల్లో గూడు కట్టుకుని ఉన్న దురభిప్రాయాలన్నీ సదూర తీరాలకు గుంపుగా ఎప్పుడో ఎగిరి పోయాయి.

''సరేనమ్మా! ఇక నేను వెళ్ళాలి'' అంటూ తను కూర్చున్న కుర్చీలోంచి పైకి లేచా డాయన.

''ఉండండి. తొందరేమిటి?'' అంది వాసంతి.

''మళ్ళీ ఈ రాత్రికే నేను తిరిగి ఊరెళ్ళి పోవాలి. అయిదొందల కిలో మీటర్ల ప్రయాణం. ఆ బస్‌లో రాత్రికి ఎటూ నిద్రపోవడానికి వీలుండదు. మా స్నేహితుడి ఇంటికి వెళ్ళి, అక్కడే కా సేపు పడుకుని విశ్రాంతి తీసుకుంటాను'' అన్నా డాయన.

''ఇక్కడ పడుకోండి.''

''ఇక్కడ పడుకుంటే మళ్ళీ సాయంత్రం లేచి మా మిత్రుడి ఇంటికి వెళ్ళాలి. అక్కడ కెళ్ళి నా బట్టలూ, అవీ సర్దుకోవాలి. పైగా నాకు బస్‌కు టైం ఉండదమ్మా.''

వాసంతి బలవంతం చెయ్యలేదు.

''ఇప్పుడు నేను చెప్పిన మాటలేవీ మనసులో పెట్టుకొని బాధపడకు తల్లీ! చిన్నప్పటి నుండి చలపతి మనస్తత్వమే అంత. చపల చిత్తుడు. నే నొస్తానమ్మా! నీ ఆరోగ్యం జాగ్రత్త''

ఇంతలో తలుపు మీద ఎవరో బాదినట్లు చప్పుడు వినిపించడంతో వెళ్ళి తలుపు తీసింది వాసంతి.

ఎదురుగా తన భర్త చలపతి.

''మీ బాబాయ్ గారొచ్చారండీ'' అంటూ హాల్లో ఉన్న ఆయన వేపు చేయి చూ పెట్టింది వాసంతి. ఆయనను చూడగానే. నిర్ఘాంత పోయాడు చలపతి.

''బాబాయ్ గారేమిటే పిచ్చి మొహమా? మా నాన్న గారైతేనూ. ఎప్పు డొచ్చారు నాన్నా?'' పలకరించాడు. చలపతి.

'నాన్నా' అంటూ తన భర్త ఆయన్ను సంబోధించగా విని శిలలా బిగుసుకు పోయింది. వాసంతి.

కుశల ప్రశ్నలు ముగిసిన తరువాత ''స్నానం చేసి ఇప్పుడే వస్తాను నాన్నా!'' అన్నాడు చలపతి.

''నేను వెళుతున్నాన్రా!''

''ఎక్కడికి వెళతారు నాన్నా? ఉండండి''

''వాత్సల్యానికీ, వర్తకానికీ చాలా దూరంరా'' అంటూ రెం డడుగులు వేశా డాయన.

''మా.. మావయ్యా!'' వాసంతి గొంతులో ఎంతో ఆత్మీయతతో కూడుకున్న అభ్యర్థన.

''నిన్ను చూశాక నాకు చాలా ఆనందంగా ఉంది. కానీ కొమ్మ మీద పాకే పురుగు ప్రభావం కాయలోని బీజం మీద పడకుండా జాగ్రత్త వహించు తల్లీ.''

చలపతి ఎంత ప్రాధేయపడినా లాభం లేకపోయింది. వీధిలోకి వెళ్ళి ఆటో ఎక్కి వెళ్ళిపోయాడు ఆయన.

చలపతి ఓ నిట్టూర్పు విడిచి బట్టలు మార్చుకుని స్నానానికి బాత్‌రూంలోకి వెళ్ళి పోయాడు.

ఆ హాల్లో షోకేస్‌లో ఉన్న ఓ శిల్పం తనను చూసి పక్కున నవ్వినట్లు అన్పించింది వాసంతికి.

ఈ విగ్రహం తన భర్త ప్రేమలాగే ఎంత అందంగా .. ఎంత ఆకర్షణీయంగా ఉంది! అయినా.. అది నిర్జీవం. నిర్జీవం కనుకనే ఇది.. ఇంత ఆకర్షణీయంగా ఉందేమో??

ఇంతలో వాసంతికి అరగంట క్రితం తను చదివిన జాహ్నవీ దేవి గారి కథ, ఆవిడకి తను సగం రాసిన ఉత్తరమూ గుర్తుకొచ్చాయి. ఆ ఉత్తరాన్ని తీసి ముక్కలు ముక్కలుగా చించేసిందామె.

'జాహ్నవీ దేవీ గారూ! ఒక వాస్తవిక సత్యాన్ని ప్రతిబింబించిన కథని రాసినందుకు అభినందిస్తున్నాను. మారీచమాయ లాంటి ప్రేమ, ఆర్థిక ప్రలోభంతో కూడిన అనురాగం ఎలా ఉంటాయో చూద్దురు గానీ మీరోసారి రండి మా ఇంటికి!' అని మనసులో అనుకుంది వాసంతి.

★

